


ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న సిడిపిఒ, సూపర్‌వైజర్లు

ప్రజాశక్తి -హుకుంపేట: ప్రజల గొంతుకు ప్రజాశక్తి అని సిడిపిఒ సిహెచ్ బాలామణిదేవి అన్నారు. గురువారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజల చేతిలో పాశుపతాస్త్రంగా ఉన్న ప్రజాశక్తి దినపత్రిక, ఇలా మంచి డిజైనింగ్‌తో అలంకరణ చేసిన కేలండర్ పాఠకులకు విశేషంగా నచ్చుతుందన్నారు. నూతన సంవత్సరంలో, సంక్రాంతికి ముందు ప్రజాశక్తి కేలండర్‌ను ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో విఆర్ఒ ధనసాని కొండబాబు ఐసిడిఎస్ సూపర్వైజర్లు, ప్రజాశక్తి విలేకరి కోర్రా.ఆనంద్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత

- జెడ్‌పి ఛైర్‌పర్సన్ జె.సుభద్ర
- జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాల్లో చర్చకు పలు అంశాలు



మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, సామాన్య ప్రజల ఆర్థిక పురోగతికి తోడ్పాటు అందించాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లపల్లి సుభద్ర అధికారులకు సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి సంక్షేమ ఫలం వారికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పని చేస్తున్న వారికి అండగా నిలవాలని పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఆమె అధ్యక్షతన 1 నుంచి 7 వరకు స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. ప్రజా పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, సంక్షేమం, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చ జరిగింది. సమావేశాల్లో భాగంగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ముందుగా చదివి వినిపించారు. వాటిపై సభ్యులు పలు ప్రశ్నలు సంధించగా ఆయా శాఖల అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, చేపట్టబోయే చర్యలను తెలియజేశారు.

ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ మహిళల ఆర్థిక ప్రగతికి కృషి చేయాలని, మైదాన ప్రాంతాల్లో మాదిరిగా పాడేరు, అరకు ప్రాంతాల్లోనూ మహిళా మార్టులను ప్రారంభించాలని డిఆర్‌డిఎ పీడీకి సూచించారు. ఉపాధి హామీ చట్టంలో భాగంగా చేపట్టే పనుల్లో మరింత నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పూడిక తొలగింపు, కాలువల శుభ్రత చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రజా పనులకు సంబంధించి బిల్లులు త్వరితగతిన మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి పెద్దపీట వేయాలని, పండ్ల తోటల పెంపకానికి తగిన ప్రోత్సాహం అందించాలని అన్నారు. యువత ఉపాధికి అవకాశ మార్గాలను అన్వేషించాలని, స్థానిక పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలని చెప్పారు. కొన్ని మండలాల్లో కింది స్థాయి అధికారులు, సిబ్బంది పనితీరు బాగోలేదని సభ్యులు ఆమె దృష్టికి తీసుకురాగా విచారించి చర్యలు తీసుకోవాలని జెడ్‌పి సిఇఒకు సూచించారు. బెల్టు షాపులు పెరిగిపోతున్నాయని, దృష్టి సారించాలని సభ్యులు కోరగా సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఛైర్‌పర్సన్ ఆదేశించారు. మినీ గోకులాలకు సంబంధించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, వాటి ప్రయోజనాలు అందుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వారంలోపే పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు

15వ ఆర్థిక సంఘం కాల పరిధిలో చేపట్టే పనులకు వారం రోజుల్లోపే బిల్లులు మంజూరు చేస్తామని జెడ్‌పి సిఇఒ ఎం.పోలినాయుడు తెలిపారు. నిధులు సరిపడా ఉన్నాయని, ఆయా పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని, ప్రారంభ, మధ్యస్త పనులకు సంబంధించి వేర్వేరుగా ఎం.బుక్‌లు సమర్పించినా కూడా బిల్లులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఇరిగేషన్ విభాగాల్లో చేపట్టే పనులకు అధిక ప్రాధాన్యత ఉంటుందని ఆయన చెప్పారు. సమావేశంలో జెడ్‌పి డిప్యూటీ సిఇఒ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, జెడ్‌పిటిసి సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయిలు విడుదల చేయండి

- సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు



ఉపాధి హామీ పనులకు సంబంధించి తక్షణం బకాయిలు విడుదల చేయాలని సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు కోరారు. 2వ స్థాయీ సంఘ సమావేశంలో గ్రామీణ అభివృద్ధిపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. మండలాల్లో డిఆర్‌డిఎ ద్వారా ప్రజలకు అందే ప్రభుత్వ పథకాలు, సంక్షేమ పథకాలు నిధుల విడుదల, ఐకెపి బ్యాంకు లింకేజ్ లోన్లు మంజూరు విషయంలో సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వటం లేదని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా జరిగిన పనులకు రెండు వారాలు మాత్రమే పేమెంట్‌లు జమయ్యాయని, నేటికీ బకాయిలు అందలేదని తెలిపారు. అనంతగిరి మండలంలో రూ.2 కోట్లు 40 లక్షల బకాయిలు ఉన్నాయని, మెటీరియల్ పేమెంట్‌కి సంబంధించి రూ.కోటీ 45 లక్షల బకాయిలు అందలేదని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 11 మండలాలకు రావాల్సిన రూ.24 కోట్లు బకాయిలను తక్షణం విడుదల చేయాలన్నారు.

31వ రోజుకు అంగన్వాడీ సమ్మె

డుంబ్రిగుడలో పొర్లుదండాలతో నిరసన ... ప్రజా సంఘాల సంఘీభావం



డుంబ్రిగుడలో పొర్లు దండాలు పెడుతున్న అంగన్వాడీలు



రంపచోడవరంలో 31 ఆకారంలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-పాడేరు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు చేపట్టిన సమ్మె గురువారం 31వ రోజు కొనసాగింది. సమ్మెలో భాగంగా పాడేరు ఐటిడిఎ ఎదుట నిరవధిక సమ్మె శిబిరంలో ముంచంగిపుట్టు, పాడేరు మండలాల అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ప్రభుత్వం తీరుపై నిరసన వ్యక్తం చేస్తూ నినదించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నేతలుభాగ్యలక్ష్మి, విజయ, చిన్నారి, సత్యవతి, సిఐటియు జిల్లా నాయకులు సుందరరావు పాల్గొన్నారు.

సాష్టాంగపడి పొర్లు దండాలు

డుంబ్రిగుడ:సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ కార్మికులు చేపడుతున్న సమ్మె గురువారం 31వ రోజుకు చేరింది. మండల కేంద్రంలోని హైవే రోడ్డు యూనియన్ బ్యాంక్ జంక్షన్ వద్ద అంగన్వాడీలు సాష్టాంగపడి, పొర్లుదండాలు పెడుతూ వినూత్నరీతిలో నిరసన, ఆందోళన చేపట్టారు. సమస్యలు పరిష్కరించేవరకు ఆందోళన కొనసాగిస్తామని, ప్రభుత్వ బెదిరింపులకు భయపడేది లేదని పెద్ద ఎత్తున కార్మికులు నినాదాలు చేశారు.కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే కొండమ్మ, కే సత్యవతి, జి పవిత్ర అంగన్వాడి కార్మికులు,హెల్పర్లు పాల్గొన్నారు.

పెదబయలు : మండల కేంద్రంలో అంగన్వాడీల సమ్మె 31వ రోజున సోమవారం కొనసాగింది. ఆందోళనలో యూనియన్ నాయకురాలు టి రాజమ్మ, శెట్టి పద్మ, సుశీల, మంగ పాల్గొన్నారు

అనంతగిరి : తమ సమస్యలను పరిష్కరించేవరకు సమ్మె నుంచి వెనక్కు తగ్గేది లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. గురువారం 31వ రోజున దీక్షను కొనసాగించారు. ఎస్మా ప్రయోగం, నోటీసులు అంటూ ప్రభుత్వ బెదిరింపులకు భయపడేది లేదని, పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. చర్చల పేరుతో ప్రభుత్వం నాన్చుడి ధోరణి వ్యవహరిస్తూ అంగన్వాడీ సమస్యలను పక్కదోవ పట్టిస్తోం దన్నారు. అంగన్వాడీ మండల యూనియన్ నాయకులు కె ,లక్ష్మి మంజుల, కళావతి, చిలకమ్మ పాల్గొన్నారు

విఆర్ పురం : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మండలంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 31వ రోజుకు చేరింది. బుధవారం మండల కేంద్రం రేకపల్లిలోని అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెలో పాటల పాడుతూ నిరసన తెలిపారు. వీరి ఆందోళనకు యుటిఎఫ్ జిల్లా నాయకులు సోడి నాగేశ్వరరావు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

రంపచోడవరం : అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే గత ప్రభుత్వాలకు పట్టిన గతే జగన్ ప్రభుత్వానికి తప్పదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి వెంకట్, జిల్లా ఉపాధ్యక్షులు పి.రామరాజు, కె శాంతిరాజు, అంగన్వాడి జిల్లా నాయకులు బి నిర్మల, కె రాణి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు తదితరులు హెచ్చరించారు. స్థానిక తాహసిల్దార్ కార్యాలయం ఎదురుగా జరుగుతున్న నిరసన శిబిరంలో రిలే నిరాహారదీక్ష చేస్తున్న అంగన్‌వాడీలకు వారు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కే రామలక్ష్మి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కొయ్యూరు : తమపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించినా తాము ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని, వెనకాడేదిలేదని అంగనవాడి యూనియన్ నేతలు స్పష్టం చేశారు. మండల కేంద్రంలో సిడిఎస్ కార్యాలయం వద్ద 31వ రోజు ఆందోళన కొనసాగింది. మోకాళ్లపై నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎస్.సూరిబాబు, యూనియన్ నాయకులు జి.అచ్చియమ్మ, ఎల్.ముత్యాలమ్మ, పివి. రమణమ్మ, ఎల్. రత్నకుమారి, జిపిరమ్యలత, కె.రాజేశ్వరి, ఎ.అమ్మాజి, ఎం.వెంకటలక్ష్మి, ఎస్.సంతోషం, జె.భారతి, కె.నూకరత్నం, పి. సత్యవేణి, డి.దేవి పాల్గొన్నారు.



విఆర్.పురంలో సంఘీభావం తెలుపుతున్న యుటిఎఫ్ నేత



కొయ్యూరులో మోకాళ్లపై నిలుచుని నినాదాలు చేస్తూ అంగన్వాడీల నిరసన



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -సీలేరు : సీలేరు ప్రభుత్వం జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యాన జరుగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ బచ్చులూరులో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలు వీడండి ఆరోగ్యాన్ని పెంపొందించుకోండి అంటూ నినాదాలు చేశారు. యువత ఖైనీ, గుట్కా, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడటం వలన బాల్యంలోనే జీవితాలు బుగ్గి పాలవుతాయన్నారు. గిరిజన యువత అతి చిన్న వయసులోనే బాల్యవివాహాలు చేసుకోవడం వలన అనేక అనర్థాలకు దారితీస్తున్నాయని చెప్పారు. పురుషులు, మహిళలు మేజర్ అయిన తర్వాతే వివాహాలు చేసుకుంటే వారి జీవితాలకు ఎటువంటి ఆటంకాలు కలగవని పేర్కొన్నారు.

నూనె రమేష్‌కు సంక్రాంతి సాహితీ పురస్కారం

ప్రజాశక్తి-విఆర్ పురం

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో గురువారం ఏలూరులో జరిగిన సంక్రాంతి సాహితీ సంబరాలు కార్యక్రమంలో మన్యం కవి నూనె రమేష్‌ను సంక్రాంతి సాహితీ పురస్కారం లభించింది. ఈ మేరకు పురస్కార ధ్రువపత్రంతో పాటు రూ.5000 నగదు బహుమతి సాహిత్య అకాడమి ఛైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి చేతుల మీదుగా అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ మన్యంలో పుట్టి కవిగా ఎదిగి ఆంధ్రప్రదేశ్ సాహితీ పురస్కారం అందుకున్న నూనె రమేష్ మరిన్ని సత్కారలు, అవార్డులు పొందాలని అభిలాషించారు. రమేష్‌కు పురస్కారం రావడం పల్ల తల్లిదండ్రులు నూనె అజరయ్య శాంతి, మండల ప్రముఖులు, గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.



నూనె రమేష్‌కు సంక్రాంతి సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న శ్రీలక్ష్మి తదితరులు

అంగన్వాడీలపై ఎస్మాను రద్దు చేయాలి

రౌండుటేబుల్ సమావేశంలో అఖిలపక్షం తీర్మానం

ప్రజాశక్తి-రంపచోడవరం

అంగన్వాడీలపై ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మాను రద్దు చేయాలని, అంగన్వాడీల వేతనాలు పెంచాలని అఖిల పక్షం తీర్మానం చేసింది. స్థానిక యుటిఎఫ్ భవనంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్ అధ్యక్షతన గురువారం అఖిలపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మాజీ శాసన సభ్యురాలు వంతల రాజేశ్వరి మాట్లాడుతూ 31 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించమని కోరుతూ అంగన్వాడీలు రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించకపోగా వారిపై ఎస్మాను ప్రయోగించడం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే అంగన్వాడీల జీతాలను రూ.10వేలు చేశారని, జగన్ ప్రభుత్వం రూ.1600 మాత్రమే పెంచిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వారికి ఇచ్చిన టిఏ బిల్లులను రద్దు చేసి దానిని జీవితంలో కలిపి రూ.11600 చెల్లిస్తున్నారన్నారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లపు వెంకట్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చకుండా మోసం చేశారన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీ మేరకు కనీసం వేతనాలు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లోత రామారావు మాట్లాడుతూ అంగన్వాడీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, చిన్న చిన్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోవడం దారుణమన్నారు. జీవో నెంబర్ 2 ద్వారా ఎస్మా ప్రయోగించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఐ వెంకటేశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు ఈతపల్లి సిరిమల్లె రెడ్డి, సిఐటియు నాయకులు కె.శాంతి రాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు అనంత మోహన్, సిద్ధ వెంకన్న, చక్రపాణి, దిండి జనార్దన్, కాంగ్రెస్, జనసేన, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు వెంకట్, చిత్రంలో వివిధ పార్టీల నాయకులు

ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-చింతూరు

అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహిన్ సింహ ఆదేశాలతో చింతూరు ఓఎస్‌డి మహేశ్వర్ రెడ్డి, ఏఎస్పీ రాహుల్ మీనా, సిఆర్‌పిఎఫ్ 42వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండర్ సురేష్ పర్యవేక్షణలో చింతూరు మండలం పేగ గ్రామపంచాయతీ పరిధి అల్లిగూడెం గ్రామంలో గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. వెయ్యి మందికిపైగా ఆదివాసీ గ్రామాల ప్రజలు వైద్య శిబిరానికి హాజరు కాగా, కొత్తగూడెంకు చెందిన శ్రీఉష మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్ అజ్మీర వెంకన్న, భద్రాచలం డాక్టర్ మోహన్‌రావు గారి నిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బాల నరసింహుడు, డాక్టర్ ఎం గురు తేజ, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ శశికళ దేవి, డాక్టర్ ప్రసన్న, డాక్టర్ టీవీ శేషారెడ్డి, గ్రామీణ వైద్యులు ఎస్కే హనీఫ్, నాగేంద్రబాబు, సత్తిబాబు, పండు, కిరణ్ తదితరులు వివిధ వ్యాధులకు వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో 350 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందించారు. ఈ క్యాంపునకు కావాల్సిన ముందులు సకినా మెడికల్స్, నిమ్స్ ఆస్పత్రి, గ్రామీణ వైద్యుల సంఘం అందజేశాయి. అనంతరం ఓ ఎస్ డి మహేందర్ రెడ్డి క్రీడా పోటీలు ప్రారంభించి క్రీడాకారులకు డ్రెస్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చింతూరు సిఐ గజేంద్ర, ఎటపాక ఎస్సై యాదగిరి, చింతూరు ఎస్ఐ శ్రీనివాస్, పేగ గ్రామపంచాయతీ సర్పంచ్ చంద్రయ్య, ఎంపీటీసీ నాగరాజు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పోలీసు అధికారులు



సిమెంట్ రేకులు, ఇనుప పైపులు అందించిన జమాల్‌ఖాన్ తదితరులు

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి
గృహ నిర్మాణ సామగ్రి వితరణ

ప్రజాశక్తి- కూనవరం

మండలంలోని అయ్యవారిగూడెం గ్రామానికి చెందిన గిరిజన మహిళ పైద సీతమ్మ పూరిల్లు గత నెలలో అగ్ని ప్రమాదంలో దగ్ధం కాగా, బాధిత కుటుంబానికి ఇంటి నిర్మాణ సామగ్రిని జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు అందించింది. అగ్ని ప్రమాదంలో ఇల్లు, ఇంట్లో ఉన్న సామగ్రి, బట్టలు, గృహోపకరణాలు కాలిపోవడంతో కట్టుబట్టలతో పైద సీతమ్మ రోడ్డున పడింది. రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న నేపథ్యంలో అగ్ని ప్రమాదం సంభవించి సర్వం కోల్పోయిన విషయాన్ని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్ తెలుసుకొని గత వారం ఆ గ్రామాన్ని సందర్శించి బాధితురాలని పరామర్శించారు. గృహ నిర్మాణానికి కావలసిన రేకులు, ఇనుప పైపులను వారంలోగా అందజేస్తామని హామీ ఇచ్చిన జమాల్ ఖాన్ గురువారం తన ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.40వేలు విలువైన ఇనుప పైపులు సిమెంట్ రేకులు అందజేశారు. ఈ సందర్భంగా జమాల్ ఖాన్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నప్పుడు సాటివారిని ఆదరించి ఆదుకోవాలని, అప్పుడే మానవ జీవితానికి సార్థకత ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెకెసి ట్రస్ట్ ఇన్చార్జి సుభాని, కూనవరం మసీద్ కమిటీ సభ్యులు సూఫీ తదితరులు పాల్గొన్నారు.

10 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని లోదొడ్డి పంచాయతీ లోదొడ్డి గ్రామ శివారులో అక్రమంగా నిర్వహిస్తున్న నాటా సారా బట్టీపై జడ్డంగి ఎస్సై రఘునాథరావు ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం దాడులు నిర్వహించారు. సారా తయారీకి ఉపయోగించే 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారాబట్టి నిర్వహిస్తున్న లోదొడ్డి గ్రామానికి చెందిన గడపల శ్రీనుబాబును అరెస్టు చేసి, ఆయన వద్ద నుండి 10 లీటర్ల నాటుసారా, వంటపాత్రల స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రంపచోడవరంకోర్టుకు తరలించగా 17 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు, దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన నాటుసారా, బెల్లం పులుపు



వద్ధులకు, మహిళకు రగ్గులు పంపిణీ చేస్తున్న నేతలు

శారదా ట్రస్టు ఆధ్వర్యాన రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకువేలి మండలంలో మాదల పంచాయితీ దోమలజోరు, రక్తకండి దాబుగుడ, బస్కి పంచాయితీ కొంత్రాయిగుడ, కంజరితోట, బిజ్జగుడ గ్రామాలకు శారదా ట్రాస్టు సహకారంతో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం వృద్ధులకు, మహిళకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి పి రామన్న మాట్లాడుతూ చలి కాలంలో నిరుపేదలైన ఆదివాసీ గిరిజనులు పడుతున్న ఇబ్బందులను గమనించి, 200 మంది గిరిజనులకు శారద ట్రస్టు, కొంతమంది దాతలు కలిసి ఇంటింటికి రగ్గులు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలో జీరో డిగ్రీల సెంటిగ్రేడ్ చలిలో గిరిజనులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి,వారికి చలి నుంచి ఉపశమనానికి రగ్గులు, జంబుఖానాలు పంపిణీ చేసి అండగా నిలవాలని సూచించారు. శారద ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కుమిడి రమేష్ కె.గోపాల్ ,అప్పన్న,కె మండల ఉపాధ్యక్షులు కె రామారావు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్‌లో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి -పాడేరు: . నిర్మాణరంగంలో నిరుద్యోగులకు ఇజ్రాయిల్ దేశంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రశాంత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాస్టరింగ్, సిరామిక్, బిల్డింగ్ ఫ్రేమ్ వర్క్, ఐరన్ బిల్డింగ్ వంటి టెక్నాలజీపై ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, 21 నుంచి 45 ఏళ్లలోపు వయసు కలిగి ఎనిమిదో తరగతి, ఆ పై విద్యార్హత కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. భవన నిర్మాణ రంగంలో మూడేళ్ల అనుభవం తప్పనిసరి అన్నారు. ఎంపికైన వారికి వసతి వెళ్లేందుకు ప్రయాణం ఖర్చులు , టాక్స్, డిడక్షన్ వంటి సౌకర్యాలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్నవారు 99499 272899(టోల్‌ఫ్రీ) నెంబర్ సంప్రదించాలని సూచించారు.



నిమ్మరసం తాగి సమ్మె విరమిస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె విరమణ

ప్రజాశక్తి -పాడేరు: సమగ్ర శిక్ష ఉద్యోగుల హైలెవల్ పాలసీ కమిటీ వేస్తామని చర్చల్లో భాగంగా ప్రభుత్వం హామీ ఇవ్వడంతో గత నెల 20 నుంచి చేస్తున్న సమ్మెను సమగ్ర శిక్ష ఉద్యోగులు గురువారం విరమించారు. ఐటిడిఎ ఎదుట సమ్మెదీక్షల శిబిరంలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు సిఐటియు జిల్లా కార్యదర్శి సభ్యులు ఎల్ సుందరరావు నిమ్మరసం ఇచ్చి సమ్మె విరమింప చేశారు.
సమగ్ర శిక్ష ఉద్యోగుల జెఏసి నాయకులతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చల్లో కొన్ని డిమాండ్లు అంగీకరించడంతో పాటు మరికొన్నింటిపై ప్రభుత్వం హామీ ఇవ్వడంతో సమ్మె విరమించినట్లు సుందరరావు తెలిపారు. పోరాటి సాధించుకున్న ఉద్యోగులకు ఉద్యమ అభినందనలు తెలిపారు. అలాగే జిల్లా విద్యాశాఖ అధికారి సమగ్ర శిక్ష ఉద్యోగులను సమ్మె విరమణ నోటీసులు ఇచ్చి, అనంతరం జాయినింగ్ రిపోర్టును జెఎసి నేతలు సమర్పించారు కార్యక్రమంలో జెఎసి అధ్యక్ష కార్యదర్శులు అనిల్, జయరాజ్, జిల్లా ట్రెజరర్ టి.సింహాచలం, సుబ్రమ్మ, అనంతలక్ష్మి, పాడి వంతలు, మణికంఠ, విజయ్ కుమార్, వాసుదేవ్, వెంకన్న దొర, రాజేశ్వరి, భారతి పాల్గొన్నారు.

15న పివిటిజిలతో పిఎం ముఖాముఖి

పిఎం జన్‌మన్‌కు ప్రధాని శ్రీకారం
ఏర్పాట్లపై అధికారులతో పిఒ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి - అరకులోయ : ఈనెల 15న ప్రధానమంత్రి నరేంద్రమోడీ పివిటిజి గిరిజనులతో వర్చువల్ విధానంలో ముఖాముఖి సంభాషిస్తారని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహాఅభియాన్ (పిఎం జన్‌మన్) పథకాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారనఅను. గురువారం పిఎం జన్‌మన్ కార్యాక్రమ నిర్వహణ వేదికైన కొత్తభల్లుగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో అధికారులతో దీనిపై సమీక్షించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ, అధికారులకు కేటాయించిన పనులను సమర్ధవంతంగా అమలు చేయాలని సూచించారు.. పివిటిజిలకు ఆయుష్మాన్ భారత్, ఆధార్ కార్డులు, ప్రధానమంత్రి జన్‌మన్ గృహాలు మంజూరు, వారికి విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పన వంటి చర్యలు చేపట్టి, దీనిపై నివేదికలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులు స్థానికంగా ఉండి చేయవలసిన పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.
సభాస్థలిలో ఏర్పాట్లుపై సూచనలు చేసి, సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆధార్, సికిల్‌సెల్ ఎనిమియా, ప్రధానమంత్రి ఉజ్వల యోజన, గృహ నిర్మాణ శాఖ, జన్ ధన్ బ్యాంకు ఖాతాలు ప్రారంభం తదితర విభాగాలకు సంబంధించి విడివిడిగా స్టాల్స్ ఏర్పాటు చేయాలని, దీనిప వెలుగు అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. లబ్దిదారులకు ఆధార్ కార్డులు, పిఎం.కిసాన్ కార్డులు జారీలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు. నిర్లక్ష్యంగా ఉంటే ఉపేక్షించబోనని స్పష్టం చేశారు. కొత్త భల్లుగుడ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సభా స్థలిని అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేసారు. సమావేశంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి విఎస్. ప్రభాకరరావు, ఎం.వేంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు ఐ. కొండలరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు జగనన్న తోడు

- రూ.8.31 కోట్ల ఆర్థిక సాయం
- వడ్డీ సాయంగా రూ.7.42లక్షలు
- జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్



చెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : జగనన్న తోడు పథకం కింద జిల్లాలో లబ్దిదారులు 7862 మంది లబ్ధిదారులకు రూ.8 కోట్ల 31 లక్షల 86 వేల ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడింఆచరు. 3910 మంది లబ్ధిదారులకు సాంప్రదాయ వృత్తి వ్యాపారులకు రూ.7 లక్షల 41వేల 952 వడ్డీ జమ చేస్తారన్నారు.
గురువారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుండి ఎనిమిదవ విడత జగనన్న తోడు ఆర్దిక సహాయం, వడ్డీని సిఎం జగన్ విడుదల చేయగా, కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో రూ.10 వేలు రుణాలు పొందిన లబ్దిదారులకు వడ్డీని లబ్దిదారుల ఖాతాలకు జమ చేసారన్నారు. అరకు వ్యాలీ నియోజకవర్గంలో 397 మందికి రూ.1 లక్ష 32 వేలు, పాడేరు నియోజకవర్గంలో 210 మందికి రూ.67 వేలు, రంపచోడవరం నియోజక వర్గంలోని 3303 మందికి రూ.5 లక్షల 43 వేలను వడ్డీకింద ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. మొత్తంగా జిల్లాలో 3910 మంది లబ్దిదారులకు రూ.7లక్షల 42 వేలు జమవుతుందని వెల్లడించారు. జగనన్న తోడు ఆర్థిక సహాయంతో ఏం చేస్తున్నారని లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. బట్టల వ్యాపారం, పాల వ్యాపారం చేస్తున్నామని లబ్దిదారులు వివరించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ వి.మురళి, పంచాయతీరాజ్ ఇఇ కె. లావణ్య కుమార్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను విధిగా తనిఖీ చేయాలి : ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి-హుకుంపేట: పోలింగ్ కేంద్రాలను సెక్టర్ అధికారులు విధిగా తనిఖీ చేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఆదేశించారు. గురువారం స్థానిక తాహశీల్దార్ కార్యాలయంలో మండల పరిధిలోని సెక్టార్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సెక్టార్ అధికారుల విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెక్టార్ అధికారులతోపాటు ఆ సెక్టార్ పరిధిలోని పోలీస్ అధికారులు సంయుక్తంగా పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ సమస్యలు, గతంలో పోలింగ్ సరళి, అవాంఛనీయ సంఘటనలు మొదలైన వాటిపై పూర్తి వివరాలు సేకరించి నివేదించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్తు, తాగునీరు, ర్యాంపు తదితర సౌకర్యాలు ఉన్నది లేనిది పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పోలింగ్ సమయంలో సమస్యలను సష్టించే వారిని, అనుమానితులను గుర్తించాలన్నారు. గత ఎన్నికలలో బైండోవర్ చేసిన వారిని గుర్తించాలని, పోలింగ్ కేంద్రాలకు అనుకూలమైన రహదారి సదుపాయాలు ఉన్నది లేనిది పరిశీలించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏయే అంశాలపై సంబంధిత సెక్టార్ అధికారులు పరిశీలనా నివేదిక అందిచాలో పూర్తి అవగాహన కల్పించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో సెక్టార్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.

నేరాలు ఘోరాలు

దుకాణం దగ్ధంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పెదబయలు : మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం అనుకొని ఉన్న దుకాణం బుధవారం అర్ధరాత్రి దగ్ధమైంది. అందరూ గాఢనిద్రలో ఉన్న సమయంలో ప్రమాదం జరగడంతో సర్వం కాలిబూడిదైంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందా? లేక ఎవరైనా కావాలనే నిప్పు అంటించారా అని అనుమానాలు వ్యక్తమౌతున్నా నేపథ్యంలో, దీనిపై దుకాణదారుతోపాటు దుకాణ యజమాని పోలీసులకు, స్థానిక తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలివి.
పెదబయలుకు పాంగి ఫాల్గుణ తన చెక్క బడ్డీని గంపరాయి ప్రసాదరావు అనే వ్యక్తికి 2015లో అద్దెకు ఇవ్వగా, దానిలో దుకాణం నిర్వహిస్తున్నాడు. మూడేళ్లుగా ఒత్తిడి చేస్తుండడంతో ఈనెల 20న ఖాళీ చేసేందుకు దుకాణదారు అంగీకరించాడని ఫాల్గుణ అంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి అగ్నిప్రమాదం జరగడంతో దుకాణంలోని టివి, ఇతర వస్తువులు కాలి మంటలు చెలరేగాయి. పెద్దశబ్దం రావటంతో ఇరుగు పొరుగు వారు బయటకు వచ్చి దుకాణ యజమానికి, అద్దెదారుడైన గంపరాయి ప్రసాద్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకొనే సరికి సర్వం బూడిదైంది. అగ్నిప్రమాదంపై అనుమానాలుండడంతో ఇరువురూ స్థానిక పోలీసులకు, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.కాగా బాధితులను వర్తక సంఘం, స్థానిక ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పరామర్శించారు,

అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లిన వ్యాన్

ప్రజాశక్తి -జి. మాడుగుల : మండలంలోని బొయితిలి పంచాయతీ పులుసుమామిడి గ్రామ సమీపంలో గురువారం ఉదయం అదుపుతప్పి వ్యాన్ లోయలోకి దూసుకెళ్లింది. మైదాన ప్రాంతం నుంచి మద్దిగరువు పరిసర ప్రాంతాలలో జియో టవర్ నిర్మాణ పనులకు సామగ్రితో వస్తున్న వ్యాన్, పులుసుమామిడి గ్రామ సమీపంలో మలుపు వద్ద అదుపుతప్పి లోయలోకి తీసుకెళ్లింది. వ్యాన్ డ్రైవర్ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో వ్యాన్‌లో ఉన్న డ్రైవర్, క్లీనర్ చిన్న గాయాలతో బయటపడినట్టు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో వాహనం నుజ్జునుజ్జయ్యింది.

16 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి- హుకుంపేట:మండలంలోని పట్టం పంచాయతీ గ్రామానికి చెందిన తాంగుల మోహన్‌దాస్ ఇంటి వద్ద నాటుసారా అమ్ముతున్నారన్న పక్కా సమాచారం మేరకు గురువారం దాడులు నిర్వహించి, 16 లీటర్ల నాటు సారా పట్టుకున్నట్లు స్థానిక ఎస్ఐ బి సతీష్ తెలిపారు. అందిన సమాచారం మేరకు .తమ సిబ్బంది చిట్టిబాబు, లవకుశ, హోంగార్డు జయకుమార్‌లను పంపగా, నిందితుడు నుంచి 50ప్యాకెట్లను, ఐదు లీటర్ల నాటుసారా కేన్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నాటుసారా తయారీ, అమ్మకాలు చట్టరీత్యా నేరమని, అతిక్రమిస్తే ఎంతటివారైనా కేసులు, అరెస్టులు తప్పవని హెచ్చరించారు. నాటుసారాపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు.

జనసేన మండల అధ్యక్షునిగా ధనేశ్వరరావు



ప్రజాశక్తి డుంబ్రిగుడ: జనసేన పార్టీ మండల అధ్యక్షుడిగా సీదిరి ధనేశ్వరరావును ఆ పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు మంగళగిరిలో పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారని ధనేశ్వరరావు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం మొదటినుంచి పాటుపడడంతో అధిష్టానం గుర్తించి తనకు పదవిని అప్పగించిందని, అధిష్టానం తనపై నమ్మకం పెట్టుకొని అప్పగించిన అధ్యక్ష బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తానని, మండలంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

వాలీబాల్ విజేత బొయితిలి జట్టు

ప్రజాశక్తి -జి .మాడుగుల : ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా మండలస్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో బొయితిలి పంచాయతీ జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో మండలంలోని 17 పంచాయతీల జట్లు పాల్గొనగా, ఫైనల్ పోటీల్లో బొయితిలి జట్టు గెలుపొందింది. విజేతలను స్థానిక సర్పంచ్ మాలన్న ప్రశంసించారు. వాలీబాల్ పోటీల్లో మరింత ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్

యువత మద్దతు చంద్రబాబుకే..
- మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: నమ్మించి మోసగించిన వైసిపి ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహంతో విసుగు చెందిన నిరుద్యోగ యువత అంతా చంద్రబాబుకే మద్దతు ఇస్తున్నారని మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైనదన్నారు. చంద్రబాబు నిర్వహిస్తున్న రా కదలిరా కార్యక్రమాలు జనస్పందన, ముఖ్యంగా యువత, నిరుద్యోగులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయడం ఇందుకు నిదర్శనమన్నారు.వైసిపిప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపే ఏకైక నాయకుడు చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడం, టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుతోనే రాష్ట్ర భవిష్యత్తు సాధ్యమని నమ్ముతున్న ప్రజలు, వచ్చే ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుబ్బారావు, పార్లమెంట్ కోశాధికారి నాగేశ్వరరావు, అరకు మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు, మాజీ వైస్ ఎంపీపీ పొద్దు అమ్మన్న, టి ఎస్ టి యు సి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి స్వామి , రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి సుబ్బారావు, మాజీ సర్పంచ్ వెంకటరావు, దారేల సర్పంచ్ పాండు రంగ స్వామి, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

ఏయూ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. గురువారం మధ్యాహ్నం ఆయన మధురవాడ దగ్గర నగరంపాలెంలో ఉన్న ఏయూ భూములను ఆకస్మికంగా తనిఖీ చేసి, పరిశీలించారు. రిజిస్ట్రార్ వెంట యూనివర్సిటీ ఇంజినీర్ ఆర్.శంకరరావు, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మహ్మద్‌ఖాన్, ఇంజినీరింగ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరంపాలెంలో ఏయూకు సంబంధించిన భూమిని, గతంలో ఇక్కడ భౌతిక శాస్త్ర సంబంధ పరిశోధనలకు ఉపయుక్తంగా నిర్మించిన భవనాన్ని పరిశీలించారు. తక్షణం ఈ స్థలం చుట్టూ గోడ నిర్మించాలని, దీనికి సంబంధించిన పనులను ప్రారంభించాలని యూనివర్సిటీ ఇంజినీర్‌ని ఆదేశించారు. ఈ ఖాళీ స్థలంలో అపరిచితులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనధికార వ్యక్తులు ఏయూ స్థలాలలోనికి ప్రవేశించరాదన్నారు. ఏయూ స్థలాల చుట్టూ రక్షణ గోడల నిర్మాణం, సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటుచేస్తామని తెలిపారు. ఆంధ్రవిశ్వవిద్యాలయానికి సంబంధించిన అంగుళం భూమిని కూడా అన్యాక్రాంతం కాకుండా పరిరక్షిస్తామన్నారు. విశ్వవిద్యాలయ అవసరాలకు అనుగుణంగా ఉపయుక్తంగా నిలుపుతామన్నారు. ఏయూ ఆస్తులను ఆక్రమించినా, ఆక్రమించాలని ప్రయత్నించినా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

రావణాపల్లిలో ఖాతాదారుల సేవా కేంద్రం

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని రావణాపల్లిలో ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంకు ఖాతాదారుల సేవా కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచి కాకురు లక్ష్మి, ఉపాధి హామీ పథకం ఏపీవో రాజు, బ్యాంకు మిత్ర దుర్గారావు తెలిపారు. ఈ మేరకు గురువారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. బ్యాంకు ఖాతాదారులు తమ లావాదేవీలు, డిపాజిట్లు, విత్ డ్రాల కోసం సేవా కేంద్రాన్ని వినియోగించుకోవాలని, ప్రైవేట్ వ్యక్తులు, సంస్థల వద్దకు వెళ్లి మోసపోవద్దని హితవు పలికారు.

'అప్పన్న' పేరిట భూ దందా!

ఎపి హౌసింగ్ బోర్డుకు రైతుల భూమి అమ్మేసిన సింహాచల దేవస్థానం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఇళ్ల స్థలాలు, జీవనోపాధి కోసం గతంలో ప్రజలు కొనుక్కున్న భూములపై సింహాచలం దేవస్థానం నేటికీ పెత్తనం చెలాయిస్తూనే ఉంది. దీంతో ఏళ్లతరబడి సామాన్య రైతులు అవస్థలు పడుతున్నారు. రైతులు, పేదల భూములను అక్రమంగా ఎపి హౌసింగ్ బోర్డు సంస్థకు అమ్మేయడంతో వారంతా లబోదిబోమంటున్నారు. ఈ తరహా భూ దందాలతో రియల్టర్ మాదిరిగా 'దేవస్థానం' వ్యవహరించడంపై 1990వ దశకం నుంచీ ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా పాలకులకు పట్టడం లేదు. పంచ గ్రామాల సమస్య నేటికీ పరిష్కరింపబడలేదు. 1994 నుంచీ భూ దందాలు నడుస్తుండడంతో సామాన్య, మధ్య తరగతి రైతులకు శ్రీ వరహాలక్ష్మీ నృసింహ దేవస్థానంతో పోరాటం తప్పడం లేదు.

భూ అక్రమం సాగిందిలా...

ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డు (ఎపిహెచ్‌బి)కి 50 ఎకరాలను జీవో ప్రకారం దేవస్థానం గతంలో అమ్మేసింది. అయితే ఇది చెల్లుబాటు కాదబి హౌసింగ్ సొసైటీ సభ్యులు 120 మంది గగ్గోలుపెడుతున్నారు. శ్రీ వరహా లక్ష్మీ నృసింహ ప్రశాంతినగర్ హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీకి చెందిన భూమిలో సగానికి పైగా ఎపి హౌసింగ్ బోర్డుకు అక్రమంగా దేవస్థానం ఇచ్చేసింది. వేపగుంట సర్వే నెంబరు 3బిలో ఎకరా 50 సెంట్లు, సర్వే నెంబరు 3సిలోని 3 ఎకరాలా 94 సెంట్లు, సర్వే నెంబరు 4లో 4 ఎకరాలా 58 సెంట్లు మొత్తం భూమి 10 ఎకరాలా 2 సెంట్లు సొసైటీది కాగా ఈ మొత్తం భూమిలోగల సర్వే నెంబరు 3బిలో ఎకరా 50 సెంట్లు, సర్వే నెంబరు 3సిలో 3 ఎకరాలా 94 సెంట్లు, సర్వే నెంబరు 4లో 99 సెంట్లు మొత్తంగా 6.33 ఎకరాల సొసైటీ భూమిని సింహాచలం దేవస్థానం ఎపి హౌసింగ్ బోర్డుకు అక్రమంగా స్వాధీనం చేసింది. దీంతో కోర్టుల చుట్టూ బాధిత సొసైటీ సభ్యులు ఏళ్లతరబడి తిరుగుతున్నారు.



సంబంధిత స్థలమిదే.. (ఫైల్ ఫొటో)

రెవెన్యూ వ్యవహారంతో సొసైటీకి తీవ్ర అన్యాయం

హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు లోచర్ల రమణాజీ గడిచిన సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా కలెక్టర్‌కు భూ సమస్యపైనా, దేవస్థానం చేసిన అన్యాయంపైనా ఫిర్యాదు చేశారు. 1994లో 11 ఎకరాలను 120 మంది సభ్యులం కొనుగోలు చేశామని ఆయన 'ప్రజాశక్తి'కి వివరిస్తూ.. ఆ తర్వాత రెండేళ్లకు అంటే 1996లో అప్పటి ప్రభుత్వం ప్రోద్బలంతో పెందుర్తి తహశీల్దారు అక్రమంగా ప్రొసీడింగ్స్ ఇచ్చారన్నారు. సింహాచలం దేవస్థానం వారికి రైత్వారీ పట్టా జారీ చేయడంతో తమకు హక్కుగల భూమిని కోల్పోవాల్సి వస్తోందని అన్నారు. ఇప్పటికీ తాము జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నట్టు తెలిపారు. తక్షణం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కలుగజేసుకుని తమ భూమిని అప్పగించాలని కోరుతున్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని పేగ పంచాయతీ అల్లుగూడెం గ్రామంలో బుధవారం రాత్రి మడకం సీతయ్య ఇల్లు దగ్ధం కావడంతో వారి కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీ చింతూరు మండల నాయకులు గురువారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఇల్ల చిన్నారెడ్డి, తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి శీలంతమ్మయ్య, నాయకులు పొదిలి రామారావు, కుంజ బాలకృష్ణ, సరిమం బ్రహ్మయ్య, బూత్ ఇంచార్జి సోడే శ్రీను సరియన్ రవీంద్ర, తునికి సత్యం తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు వరకూ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ సేవలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం - విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను గుంటూరు స్టేషన్ వరకు పొడిగించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 22701 విశాఖపట్నం - విజయవాడ - గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైలు జనవరి 13 నుంచి గుంటూరు వరకూ వెళ్తుంది. ఇది విశాఖపట్నం నుండి ఉదయం 5.20 గంటలకు బయలుదేరి 11:25 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. మరలా 11.35 గంటలకు బయలుదేరి 13.00 గంటలకు గుంటూరు వెళ్తుంది. 22702 గుంటూరు - విజయవాడ - విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్ జనవరి 13 నుంచి సాయంత్రం 16.00 గంటలకు గుంటూరులో బయలుదేరి 17.05 గంటలకు విజయవాడ చేరుకుని మరలా 17.15 గంటలకు బయలుదేరి రాత్రి 22:55 గంటలకు విశాఖపట్నం వెళ్తుంది. ఈ రైలు విశాఖపట్నం - గుంటూరు మధ్య దువ్వాడ, అనకాపల్లి, తుని, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు మీదుగా ప్రయాణిస్తుంది.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖకు 4వ స్థానం
- జాతీయ స్థాయిలో పరిశుభ్ర నగరంగా పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజల సహకారం, పారిశుధ్య కార్మికుల నిరంతర కృషి ఫలితంగా జాతీయ స్థాయిలో పరిశుభ్ర నగరంగా విశాఖకు గుర్తింపు దక్కింది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఈ మహా నగరం నాలుగో స్థానాన్ని కైవశం చేసుకుంది. ఈ మేరకు పురస్కారాన్ని గురువారం ఢిల్లీలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధ్యక్షతన జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కార ప్రదాన కార్యక్రమంలో కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి చేతుల మీదుగా జివిఎంసి స్వీకరించింది. ఈ అత్యుత్తమ పురస్కార గౌరవాన్ని నగర ప్రజలకు అంకితం చేస్తున్నట్టు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ గురువారం ఢిల్లీ నుంచి పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించారు. ప్రతి ఏటా పరిశుభ్ర నగరాల్లో విశాఖ ప్రగతి దిశగానే సాగుతోందన్నారు. సింగిల్ డిజిట్ పరిశుభ్ర నగర స్థాయిని పొందుతూనే వుందన్నారు.
2023 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కూడా స్వచ్ఛ భారత్ మిషన్ రూపొందించిన సర్వీస్ లెవెల్ ప్రోగ్రెస్ (4830 మార్కులకు), సర్టిఫికేషన్ (2500 మార్కులకు), సిటిజెన్ వాయిస్ (2170 మార్కులకు) అంశాలకు సంబంధించి 9500 మార్కులకుగానూ విశాఖపట్నం 8879.25 మార్కులు దక్కించుకుంది. 4477 నగరాల మధ్య పోటీలో ఒక లక్ష కంటే ఎక్కువ జనాభా కలిగిన నగరాల జాబితాలో జాతీయ స్థాయిలో నాలుగో పరిశుభ్ర నగర స్థాయి పురస్కారాన్ని అందుకుంది. విశాఖ నగరాన్ని పరిశుభ్ర, పర్యావరణహిత, చెత్త రహిత, కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దడంలో సహకరించిన అందరికీ మేయర్, కమిషనర్ ధన్యవాదాలు తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2024లో కూడా మొదటి మూడు స్థానాలలో నిలిచేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



ఎం.మాకవరం జట్టు సభ్యులు

ఎం.మాకవరం క్రీడాకారుల విజయం

ప్రజాశక్తి కొయ్యూరు : మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ గ్రౌండ్లో బుధ, గురువారాల్లో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. ఎంపీడీవో లాలం సీతయ్య, ఎస్సై రాజారావు పర్యవేక్షణలో ఈ క్రీడా పోటీలు జరిగాయి. గురువారం జరిగిన క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడా పోటీల్లో మండలంలోని ఎం.మాకవరం గ్రామ సచివాలయానికి చెందిన క్రీడాకారులు విజయం సాధించారు. వీరిని ఎంపీపీ బడుగు రమేష్, ఎంపీడీవో లాలం సీతయ్య ఎస్సై రాజారావు అభినందించారు.

అధికార పార్టీ ప్రచారం కోసం.. వృద్ధులను ఇబ్బంది పెట్టడం సరికాదు

ప్రజాశక్తి - కూనవరం : అధికార పార్టీ ప్రచారం కోసం వృద్ధులను ఇబ్బంది పెట్టడం సరికాదని సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య అన్నారు. పెరిగిన పెన్షన్ రూ.3000 ఇచ్చేందుకు మంగళవారం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు ఆలస్యంగా రావడంతో మధ్యాన్నం 12 నుండి సాయంత్రం 6 గంటల వరకు వృద్దులు, మహిళలు మానసిక వికలాంగులు తీవ్ర ఇబ్బంది పడ్డారని పేర్కొన్నారు. అయినా ఆరోజు ఇవ్వకుండా మరుసటి రోజు ఇచ్చారన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కొంతమంది పాకుతూ కూడా వచ్చారని, అధికార పార్టీ స్వలాభం కోసం వారిని ఇబ్బంది చేయడం దారుణమన్నారు. చీకటి పడడంతో సుదూర ప్రాంతాల వారు గ్రామాలకు చేరడానికి ఇబ్బంది పడ్డారని తెలిపారు. ఒకటో తేదీన రావాల్సిన పెన్షన్‌ను ఇన్ని రోజులు వాయిదా వేసి వారిని ఇబ్బంది పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులను అడ్డుపెట్టి ఎన్నికల ప్రచారం చేయడం ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యవస్థకు పెను ప్రమాదంగా ఉందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరంలోని 33/11 కె.వి సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుండి 11 గంటల వరకు రంపచోడవరం మండల పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఇఇ యండి.యూసఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు దీనికి సహకరంచవలసిందిగా ఆయన కోరారు.

నేడు డిజిటల్ లైబ్రరీ ప్రారంభం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం వేటుకూరు గ్రామంలో స్వేచ్ఛ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన కమ్యూనిటీ డిజిటల్ లైబ్రరీని శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ శ్రీపతి రాయ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచమంతా డిజిటల్ నాలెడ్జ్‌తో కంప్యూటర్ ద్వారా విజ్ఞానాన్ని పొందుతున్న ఈ సమయంలో గిరిజన గ్రామాల యువతకు, విద్యార్థులకు డిజిటల్ విద్యని అందించి డిజిటల్ అసమానతలు తగ్గించాలనే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామంలో పిల్లలకు డ్రాయింగ్, వ్యాస రచన, ఎలక్యూషన్, పాటలు, నృత్యం వంటి వివిధ విభాగాల్లో ఈవెంట్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 12వ తారీకు ఉదయం 10 గంటల నుంచి ఒకటిన్నర వరకు ఈవెంట్ జరుగుతాయని, మధ్యాహ్నం 2:30 నుంచి 4:30 వరకు కంప్యూటర్ శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఉదయం 9.30 లోపు వచ్చి వేటుకూరు గ్రామంలో స్కూలు వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఓలాలో హార్వెస్ట్ ఫెస్టివల్ ఆఫర్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ కేంద్రంగా సంక్రాంతి పండగకు గుర్తుగా 'ఓలా' ఎలక్ట్రిక్ రూ.15 వేలు వరకు విలువైన హార్వెస్ట్ ఫెస్టివల్ ఆఫర్లను ప్రకటించిందని ఆ కంపెనీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ఆఫర్ ఈ నెల 15 వరకు అమలులో ఉంటుందని ప్రతినిధులు వెల్లడించారు. ఆఫర్‌లో భాగంగా ఎస్ 1 ప్రో, ఎస్ 1 ఎయిర్ కొనుగోలుపై రూ.6,999 వరకు పొడిగించిన బ్యాటరీ వారంటీ, రూ.వేల వరకు ఎక్స్ఛేంజ్ బోనస్, ఆకర్షణీయమైన ఫైనాన్స్ డీల్‌లు ఉన్నాయన్నారు